## కార్మికులకు 35 శాతం లాభాల వాటా చెల్లించాలి

- సీఎండీకి ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్‌వినతి



సీఎండీకి వినతి పత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్, జూన్ 8 : సింగరేణి కార్మికులకు సంస్థ లాభాల నుంచి 35 శాతం వాటా ఇవ్వాలని కోరుతూ శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఎండీ బలరామ్‌ను కలిసి ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బీ జనక్‌ప్రసాద్ వినతి పత్రం అందించారు. ఆర్థిక సంవత్సరం ముగిసి మూడు నెలలు అవుతుందని, వెంటనే లాభాలు ప్రకటించి కార్మికులకు వాటా ఇవ్వాలని కోరారు. 2023-24 సంవత్సరం 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని చెప్పారు. గతేడాది 2022-23లో 67.13 మిలియన్ టన్నుల ఉత్పత్తి, 2222 కోట్ల లాభాలు వచ్చాయని, కార్మికులకు 32 శాతం లాభాల వాటా ఇచ్చారన్నారు. ఇప్పుడు అదనంగా 3 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 37 వేల కోట్ల టర్నోవర్ జరిగిందన్నారు. వెంటనే సీఎండీ బలరామ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కార్మికులకు లాభాల వాటా ప్రకటించాలని కోరారు.

## 'సార్లూ' ప్రారంభించండి..



మస్కాపూర్‌లో రూ.1.50 కోట్లతో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన భవనం

ఖానాపూర్ రూరల్, జూన్ 8 : ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్, బాదనకుర్తి గ్రామాల్లో రూ.2.50 కోట్లతో కేసీఆర్ హయాంలో భవన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు కూడా చివరి దశకు చేరుకోగా.. ఫ్లో రింగ్, బ్లాక్‌బోర్డులు, పేయింటింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇంతలోనే అసెం బ్లీ ఎన్నికలు రావడం, కొత్త సర్కారు ఏర్పడడంతో బిల్లుల చెల్లింపులో జాప్యం అవుతున్నది. దీనికితోడు కాంగ్రెస్ సర్కారు బిల్లులు మంజూరు చేయకుండా.. అమ్మ ఆదర్శ కార్యక్రమంలో భాగంగా లక్షలు వెచ్చించి టాయిలెట్స్ నిర్మిస్తున్నది. కట్టిన వాటికి బిల్లులు మంజూరు చేయకపోగా.. కొత్తవాటిని నిర్మిస్తున్నది. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు మిగిలిన పనులను పూర్తి చేసి, పాఠశాలను అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కరంజిలో అత్యాధునిక వ్యవసాయ యంత్రం



చేనులో మందు పిచికారీ చేస్తున్న బులక్ స్ప్రేయర్

తాంసి(భీంపూర్), జూన్ 8 : భీంపూర్ మండలంలోని కరంజి(టీ)లో అత్యాధునిక వ్యవసాయ యంత్రం అందరిని ఆకట్టుకుంటున్నది. చింతల పోతారెడ్డి అనే రైతు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి బులక్ స్ప్రింక్లర్ స్ప్రేయర్ అనే యంత్రాన్ని రూ. లక్షకు కొని తెచ్చాడు. ఎడ్ల బండికే అమర్చే ఈ యంత్రం గడ్డి మందు లేదా పురుగుల మందు కలిపిన నీటి చుక్కలను భూమికి అందిస్తుంది. ప్రస్తుతం దుక్కి అయిన భూమిలో ఈ యంత్రాలతో గడ్డి పెరగకుండా మందు వేస్తున్నారు. తర్వాత పంటలకు దీని ద్వారా పురుగు మందు అందించవచ్చని.. దీంతో సమయం, కూలీ ఖర్చు కలిసివస్తుందని రైతు వివరించారు. ఒక రోజు కనీసం పదెకరాల్లో ఇది పని చేస్తుంది. రైతులకు సొంత చేలతోపాటు అవసరమైతే తోటి రైతులకు ఈ యంత్రం కిరాయితో ఆదాయం సమకూర్చుకునే వీలున్నది.

# లోక్ అదాలత్‌లో రాజీమార్గంతో కేసుల పరిష్కారం

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎంవీ రమేశ్



ఆసిఫాబాద్‌లో కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా జడ్జి ఎం.వీ రమేశ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 8: జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యాయస్థానం భవన సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే యువరాజ్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జే అనంతలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్ కేసులతోపాటు ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులతో పాటు, ఎక్సైజ్, సీసీ ఎస్టీసీ, సైబర్ క్రైమ్‌లతో కలిపి 1045 కేసులకు గాను 17,76,740 మొత్తాన్ని అపరాధ రుసుము రూపంలో వసూలు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో మూడు బెంచ్‌లతో పాటు సిరిపూర్‌లో ఒక బెంచ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

**లోక్ అదాలత్‌లో 4462 కేసుల పరిష్కారం**

మంచిర్యాల ఏసీసీ, మే 8: లోక్ అదాలత్‌లో 4462 కేసులను పరిష్కరించినట్లు, 46 పీఎల్‌సీ బ్యాంక్ కేసులకు సంబంధించి రూ.86,43,245 నగదును సైతం రికవరీ చేసినట్లు శనివారం మంచిర్యాల జిల్లా ప్రధాన న్యాయ మూర్తి బోయ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ మంచిర్యాల అర్పితా రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ సంపత్, సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ నిరోషతో కలిసి మాట్లాడుతూ న్యాయ స్థానంలో పెండింగ్లో ఉన్న రాజీకి తెగని కేసులను సత్వరమే తగిన విధంగా న్యాయ పరిష్కారానికి ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులున్నారు.

**చెన్నూర్ 630 కేసులు పరిష్కారం..**

చెన్నూర్ టౌన్, జూన్ 8 : చెన్నూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ఆవరణలో సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు సివిల్ జడ్జి పర్వతపు రవి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. కోర్టు పరిధిలోని సుమారు 630 కేసులు రాజీ అయ్యాయి. ఇందులో 27 క్రిమినల్, 31 ఎక్సైజ్, 1 ఎన్ఐ యాక్ట్ కేసులు, 3 సివిల్, 540 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు గాను రూ.4,62,000లు జరిమానా విధించారు. 28 బ్యాంకు కేసులకు గాను రూ.21,71,600 రాజీ పడ్డారు. ఈ కార్యక్రమంలో పట్టణ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.



చెన్నూర్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి, న్యాయవాదులు

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్

కాగజ్‌నగర్, జూన్ 8: తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. పాఠ్య పుస్తకాలు, దుస్తులు, స్టేషనరీ విద్యాలయాల్లో విక్రయించకూడదని ప్రభుత్వ ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందించాలన్నారు. పాఠశాల ప్రారంభం రోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలన్నారు.

**జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్ఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ సమక్షంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వసాకె సాయికుమార్, కార్యదర్శి చాపిలే సాయిక్రిష్ణ, తదితరులను ఎన్నుకున్నారు.

## రామోజీరావు మృతికి సంతాపం



మంచిర్యాలలో నివాళులర్పిస్తున్న కమ్మ సేవాసమితి సభ్యులు

మంచిర్యాల ఏసీసీ, మే 8: ఈనాడు సంస్థల అధిపతి కీర్తిశేషులు చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి శనివారం కమ్మసేవా సమితి మంచిర్యాల, అసిఫాబాద్ జిల్లాల ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలోగల కమ్మసేవా సమితి కార్యాలయంలో పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**కాగజ్‌నగర్, జూన్ 8:** రామోజీ రావు మరణం తీరని లోటని సీనియర్ సిటిజన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్య నారాయణ, నారాయణ, పూర్ణ చందర్, వాహబ్, కలికోట రమణయ్య, యేల్లాగౌడ్, పాపయ్య అన్నారు.

**జన్నారం, జూన్ 8 :**ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీ రావు మృతి పట్ల మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ అధ్వర్యంలో రామోజీరావు చిత్రాపటానికి పూలమాలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

**రెబ్బెన, జూన్ 8:** తెలుగుజాతికి రామోజీరావు చేసిన సేవలు మరువలేనివని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. రెబ్బెన మండల కేంద్రంలో శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## సింగరేణి లాభాలు వెంటనే ప్రకటించాలి

- సీఎంపీఎఫ్ చీటీలు వెంటనే ఇవ్వాలి
- టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్

శ్రీరాంపూర్, జూన్ 8 : సింగరేణి 2023-24 ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలు సాధించడం జరిగిందని, ఆర్థిక సంవత్సరం ముగిసి మూడు నెలలైనా సంస్థ లాభాలు ప్రకటించలేదని, ఇప్పటికైనా స్పందించి కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలని టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కార్మికుల సీఎంపీఎఫ్ డిజిటలైజేషన్ చేపిస్తామని చెప్పి ఇంత వరకు ప్రక్రియ మొదలు పెట్టలేదన్నారు. కార్మికుల సీఎంపీఎఫ్ జమా లెక్కల చీటీలు వెంటనే ఇవ్వాలన్నారు. కార్మికుల ఆదాయపు పన్ను లెక్కలు(ఫైలింగ్) యాజమాన్యమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సీఎంపీఫ్ ద్వారా రుణాల కోసం పెట్టుకున్న దరఖాస్తులు వెంటనే పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా మాజీ ఉపాధక్షుడు బండి రమేశ్, కార్యదర్శి పానగంటి సత్తయ్య, కేంద్ర నాకులు పొగాకు రమేశ్, అన్వేష్ రెడ్డి, సాదుల భాస్కర్, మహిపాల్‌రెడ్డి, గొర్ల సంతోష్, ఉత్తేజ్‌రెడ్డి, వికాస్, ఎండీ లాలా పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకోండి

రెబ్బెన, జూన్ 8 : సింగరేణిలో మేనేజ్‌మెంట్ ట్రైనీ ఉద్యోగాల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు జీఎం(పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ) దీక్షితులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణి కాలరీస్ కంపెని లిమిటెడ్ 15.03.2024 నోటిఫికేషన్ ద్వారా మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఇఅండ్ఎం), మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్), జేఎంఈటీ అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ ఎలక్ట్రికల్, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ మెకానికల్, ఫిట్టర్ ట్రైనీ, ఎలక్ట్రీషియన్ ట్రైనీ ఉద్యోగాల భర్తీ కోసం అభ్యర్థుల నుంచచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## సొంత ఖర్చుతో విద్యుత్ స్తంభం ఏర్పాటు



విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయిస్తున్న కౌన్సిలర్ కుమార్

శ్రీరాంపూర్, జూన్ 8 : నస్పూర్ మున్సిపాలిటీ పరిది 6వ వార్డు ఆర్కే 8కాలనీ సుందరయ్యనగర్‌లో కౌన్సిలర్ పూదరి కుమార్ తన ఖర్చుతో శనివారం విద్యుత్ ఫోల్ ఏర్పాటు చేశారు. వార్డు ప్రజలు విద్యుత్ తీగలు ఇంటికి ఆనుకొని ఉండడంతో గాలీ, దుమార్ లేచినప్పుడు ఇల్లకు తగిలీ విద్యుత్ షాక్ వస్తుందని కౌన్సిలర్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించి 6000 రూపాయలతో తన స్వంత ఖర్చుతో ఫోల్ ఏర్పాటు చేసినట్లు కుమార్ పేర్కొన్నారు. స్థానికులు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

